
**కథ**

# ఆమని

పక్కపక్క ఇళ్లు కావడం మూలాన ఆమని వాళ్ల కుటుంబానికీ, మా కుటుంబానికీ మంచి సాన్నిహిత్యం వుంది. ఆమని, నేను చిన్నప్పటినుంచి మంచి స్నేహితులం. నాకన్నా ఐదు సంవత్సరాలు చిన్నది కావడం మూలాన చదువులో సాధారణంగా సహాయం చేస్తుండేవాడిని. అన్ని విషయాలలోనూ నేనంటే తనకెంతో గురి. ఎప్పుడైనా ఏదైనా ఆమనికి నచ్చచెప్పాల్సివుంటే ఆమని తల్లిదండ్రులు కూడా నాకే చెప్పేవారు.



నేను ఇంజనీరింగ్‌లో చేరిన తరువాత సెలవులకు వచ్చినప్పుడల్లా ఆ మధ్యలో జరిగిన అన్ని విశేషాలను చెప్పుకునేవాళ్లం. ఊర్లో విశేషాలను తను చెప్పేది. కాలేజీలో జరిగిన విశేషాలను నేను చెప్పేవాడిని. సినిమాల గురించి, ప్రేమ గురించి, పాలిటిక్స్ గురించి, ఒకటేమిటి అన్ని విషయాలు మాట్లాడుకొనేవాళ్లం. నాతో చర్చించడం వల్లే ఆమనికి లోక విషయాలను గురించి అవగాహన పెరిగిందని, ఆత్మ వికాసం కలిగిందని నాకు పూర్తి నమ్మకం.

ఒకసారి సినిమాల గురించి మాట్లాడుతూ ఇప్పటి సినిమాలు ఎంత అసంబద్ధంగా వుంటున్నాయో చెప్పాను. కథతో సంబంధం లేకుండా వచ్చే గ్రూపు డాన్సులు చూసి మన తరువాతి తరం వారు నవ్వుకుంటారనీ, ఈ సినిమాలను ఆదరించిన మన తరాన్ని తెలివితక్కువ వారుగా పరిగణిస్తారని చెప్పాను. ఆ వారం సినిమాల గురించిన ప్రతి విషయాన్ని చర్చించాము.

మరొకసారి ప్రేమవివాహాల గురించి ప్రస్తావన వచ్చింది. ఊర్లో రెండు సంవత్సరాల క్రిందట సంచలనం సృష్టించిన ప్రేమవివాహం, విడాకుల దాకా వచ్చిందనే వార్త ఆమని తీసుకువచ్చింది. ఊర్లో అందరిని ఎదిరించి, అడ్డంకులు అన్నింటిని ఎదుర్కొన్న జంట విడిపోయే పరిస్థితులు పరిశీలిస్తే కొన్ని విషయాలు బయటపడ్డాయి. వీళ్లిద్దరూ స్వతహాగా విశాల మనస్తత్వం కలిగినవారు కాని, జీవితంలో సర్దుకొనిపోయే మనస్తత్వం కలిగినవారు కాని కారు. ఆ అమ్మాయి గురించి ఆమనికి బాగా తెలుసు. చిన్నప్పటినుంచి ఏదైనా కావాలంటే పట్టుపట్టి సాధించుకొనేది. కుదరకపోతే ఎంతో ఉక్రోషంతో గొడవ చేసేది. రోజూ కాలేజీకి వెళ్లే దారిలో తనకోసం ఎదురుచూసే వ్యక్తి ఆ అమ్మాయి అహం సంతృప్తిపరచడం, ప్రేమ పెళ్లిగా మారడం జరిగాయి. కొన్ని రోజులకు ప్రేమ మామూలు అవడం, ప్రేమించిన వ్యక్తి తనను రాణి లాగా కాక మామూలు వ్యక్తిలాగా చూడటం తట్టుకోలేకపోయింది. దానికి తోడు భర్త సంపాదించే సంపాదన తన కోర్కెలు తీర్చలేకపోవడంతో ఆ అమ్మాయి తీవ్ర అసంతృప్తికి గురయింది. నా అవసరాలనన్నింటిని తీర్చలేనివాడివి నా వెనక పడి ప్రేమించి ఎందుకు పెళ్లాడావని ఒకరోజు భర్తను నిలదీసింది. ఆ విధంగా

**నందగోపాల్**

చేయడం జీవితంలో తను చేసిన పెద్దతప్పనీ, నీకంటే అందగత్తె, అణకువ గల అమ్మాయి కట్నంతో సహా తనకు దొరికేదనీ అతను అనడంతో ఆమె అవాక్కయింది. ఇద్దరూ తాము జీవితంలో ఎంత మోసపోయిందీ ఊహించుకుంటూ నిత్య ఘర్షణతో వున్నారని తెలిసింది. చివరకు మాకు అనిపించింది ఏమిటంటే ప్రేమవివాహాలు సఫలం కావాలంటే పెళ్లికి ముందు వాళ్ల ప్రేమ ఎంత ఘాటుగా వుంది అనేదానికన్నా మిగిలిన విషయాలలో వాళ్ల వ్యక్తిత్వం ఎలా వుంది అన్నదే చూడాలి. మిగిలిన అన్ని విషయాలలో స్వార్థపరు

లుగా, సంకుచిత మనస్తత్వంతో వున్నవారు మంచి ప్రేమికులు కాలేరు.

నేను ఉద్యోగంలో చేరిన తరువాత ఇంటికి వచ్చినా ఎక్కువ రోజులు వుండడం కుదరడంలేదు. మూడురోజుల క్రిందట పండుగకు ఇంటికి వచ్చినప్పుడు సెలవులకు హైదరాబాద్ నించి వచ్చిన ఆమని పిన్ని కూతురు స్వాప్నికను ఆమని నాకు పరిచయం చేసింది. ఆరోజు ముగ్గురం కూర్చుని హైదరాబాద్ విశేషాలు, వాళ్ల కాలేజీ విషయాలు మాట్లాడుకున్నాము. స్వాప్నిక చదువుతున్నది ఇంటర్‌మీడియేట్ అయిన ప్పటికీ ఏ విషయాన్నీ బిడియం లేకుండా, స్వేచ్ఛగా మాట్లాడుతుంటే ఆమని, నేనూ ఆశ్చర్యంగా స్వాప్నికను చూశాము. సిటీ లైఫ్‌కీ, మా ఊరి జీవితానికీ వున్న అంతరం గురించి మాట్లాడుకున్నాము.

మరునటిరోజు నేను ఆమని కోసం వాళ్ల గుమ్మం దగ్గరకు వెళ్లగానే బయట వున్న స్వాప్నిక "అక్కా, నీ బాయ్‌ఫ్రెండ్ వచ్చాడు" అని పిలవడంతో నేను అవాక్కయ్యాను. సిగ్గుతో తల దించుకున్నాను. ఆమని "ఏయ్, నోర్ముయ్" అని చెల్లిని మందలించి బయటకు వచ్చింది. కాని ఆరోజు ఆమనితో ప్రతిరోజులా స్వేచ్ఛగా మాట్లాడలేకపోయాను.

మరునటిరోజు ఉదయం ఆమని గార్డెన్‌లో మొక్కలకు నీళ్లు పెడుతుండగా చూశాను. ఆమనిని పుట్టిన దగ్గరనుంచి చూస్తున్నప్పటికీ మొదటిసారిగా ఆమని అందాల్ని పరిశీలించడం మొదలుపెట్టాను. యధాలాపంగా వెనుకకు తిరిగిందో లేక తనను ఎవరో చూస్తున్నారని తెలిసి తిరిగిందో తెలియదు కాని ఒక్కసారి వెనుకకు తిరిగి నన్ను చూసింది. నేను తన కళ్లలోకి చూడలేక, అక్కడ కూర్చోలేక చటాలున లేచి ఇంట్లోకి వెళ్లాను.

నేను ఆరోజు పడిన బాధ పుట్టిపెరిగిన తరువాత ఎప్పుడూ పడలేదు. "నీ గురించి ఎంతో గొప్పగా అనుకున్నాను. కాని నువ్వు కూడా అందరి మగాళ్లలాగానే ప్రవర్తించావు" అని ఆమని అడుగుతున్నట్టు అనిపించింది. అసలు అడగాల్సిన పనిలేదు. ఆ భావంతో ఒక్క చూపు చూసినా నేను తట్టుకోగలనా! మంచివాడిగా పేరు తెచ్చుకోవడం కోసం నా మనసులోని ఆలోచనలు తొక్కిపట్టి మంచివాడిగా నేను ఎప్పుడూ నటించలేదు. నా భావాలను స్పష్టం చేయగల ధైర్యం నాకు ఎప్పుడూ వుండేది. నిన్న స్వాప్నిక 'బాయ్‌ఫ్రెండ్' అనే మాట ఉపయోగించడంతో అంతరంగంలో ఏ మూలో వున్న ఆలోచన పెద్దదయి నన్ను ఇలా ఆమని అందాల్ని వెదకడానికి పురిగొల్పి వుంటుంది. ఏదేమైనా ఎన్నో సంవత్సరాలుగా సంపాదించిన మంచితనం ఒక్కపూటతో కొట్టుకుపోయింది. ఎంతో తెలివిగలదీ, చురుకైనదీ, మానవ వ్యక్తిత్వాలను అంచనా వేయడంలో అనుభవమున్న ఆమని నాలో జరిగిన ఈ మార్పును ఇట్టే పసిగట్టగలదు.

ఆమనికి ముఖం చూపే ధైర్యం నాకు లేదు. ఎప్పటిలా ఇక ఆమనితో స్వేచ్ఛగా, నిజాయితీగా మాట్లాడలేను. ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని కలలో కూడా నేను ఊహించలేదు. తల్చుకున్నకొద్దీ దుఃఖం అధికమయింది. సాయంత్రం నేను బయటకు కూడా రాలేకపోయాను. ఆమని మాత్రం మామూలుగానే బయటకు వచ్చి స్వాప్నికతో మాట్లాడటం వినిపించింది. కాని నాకు మాత్రం బయటకు నడిచే ధైర్యం లేకపోయింది. లోకమంతా తలక్రిందులైనట్టు అనిపించి రాత్రంతా నిద్ర పట్టలేదు. ఎప్పుడూ ఎరగనిది రాత్రి ఎంతోసేపు ఏడ్చిన తరువాత కొంచెంసేపు నిద్ర పోగలిగాను.

ఉదయం నేను వరండాలోకి వచ్చేసరికి మా అక్కతో ఆమని మాట్లాడుతోంది. నేను ఒక్కసారిగా ఆగిపోయాను. నా ముఖం చూసి మా అక్క "రాత్రి నిద్రపోలేదా ముఖం అలా వుంది" అంది. ఆమని అర్థం అయినట్టుగా చూసి చిరునవ్వు నవ్వింది. తను నవ్వుతూ చూసిన చూపులో ఎన్నో అర్థాలు వున్నాయి. బాధపడే పిల్లవాడిని ఓదార్చే ప్రేమ, వాత్సల్యంతో కూడిన చూపు అది. దాంతో నా హృదయం ఒక్కసారిగా దూదిపింజలా తేలిక అయిపోయింది. నా హృదయంలోని బాధ అంతా మటుమాయమైపోయి ఒక్కసారిగా కళ్లలోకి కాంతి వచ్చింది. సాయంత్రం గుడికి వెళ్తున్నానని మా అక్కతో చెప్పి ఆమని వెళ్లిపోయింది. వెళ్లేటప్పుడు మళ్లీ నన్ను చూసి నవ్వి వెళ్లిపోయింది. నా గురించి పూర్తిగా తెలిసిన ఆమని, నేను బాధపడతానని తెలిసి ఓదార్చడానికే వచ్చిందని అనుకున్నాను.

సాయంత్రం ఆమని గుడికి వెళ్లే సమయానికి నేను బయట నిల్చొని వున్నాను. నువ్వు ఇక్కడ నించొని వుంటావని నాకు తెలుసు అన్నట్టుగా చూసి చిరునవ్వు నవ్వి ఆమని ముందుకు నడిచింది. ముందు వున్న స్వాప్నికను ఒకటి కొట్టి ప్రేమగా కౌగలించుకొని నడిపిస్తూ, మాట్లాడుతూ, ఓరకంటితో నన్ను చూసి నవ్వి వెళ్లిపోయింది. నా ఆమని అలా ప్రవర్తించగలదని నేను ఎన్నడూ ఊహించలేదు. ఆ చూపులో ప్రేమ వుంది. ఆ మాటలో ప్రేమ వుంది. ఆ కదలికలో ప్రేమ వుంది. ఇవి ప్రేమను వ్యక్తం చేయలేకపోతే ఏ మాటలూ ప్రేమను వ్యక్తం చేయలేవు.

నా మనసు మనసులో లేదు. ఆమనిని చూడకుండానే 'కళ్లెత్తితే చాలు కనకాభిషేకాలు' అని ఎంకిని గురించి నండూరి ఎలా రాయగలిగాడో నాకు అర్థం కాలేదు. బహుశా ఆమనిలాగే ఎంకి కూడా అన్ని తరాల ప్రేమమూర్తులకు ప్రతీక అయి వుండవచ్చు. లేకపోతే ఒక్క నిమిషంలో ఇంత ప్రేమను ఎలా వ్యక్తం చేయగలుగుతోంది.

ఆమని ప్రతి కదలిక, గొంతు కళ్లు అన్నీ నన్ను తీవ్రంగా కదిలించడం, బాధించడం మొదలుపెట్టాయి. ఈ విషయం పూర్తిగా తెలిసినట్టుగానే ఆమని ప్రతిచర్యలోనూ నాపై ప్రేమ కురిపించడం మొదలుపెట్టింది. దూరంగా వుండి ఇలా ప్రేమను కురిపించడం ఎంత నిర్దయతో కూడిన పని. ఇందాక ఆమని కనిపించినప్పుడు "ఎప్పుడో చేతికి చిక్కకపోవులే" అని నేను అన్నప్పుడు తను నవ్వుతూ 'నీ చేతికి చిక్కడం నాకు కూడా సంతోషమే' అన్నట్టు తలూపుతూ వెళ్లింది. ఇప్పటివరకూ అన్ని విషయాలలో నాది పైచేయిగా వుండేది. ఇప్పుడు ఆమని నా జీవితాన్ని నిర్దేశించే స్థితికి చేరిపోయింది. ఈ రెండురోజుల్లో ఆమని నా జీవితాన్ని మొత్తాన్ని తలక్రిందులు చేసింది. ప్రేమ నన్ను నిలవనీయకుండా బాధించింది.

అన్నిటికన్నా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే నా పెళ్లి ఆమనితో జరుగుతుందని ఎప్పటినుంచో ఇద్దరి ఇళ్లలోనూ అనుకుంటున్నారట. నాతో కనీసం ఎవరూ ఈ విషయాన్ని ప్రస్తావించలేదు. అది ఈరోజే నాకు తెలిసింది. ఆమని పెళ్లంటూ చేసుకుంటే నన్నే చేసుకుంటానని వాళ్ల అమ్మకు చెప్పడం జరిగిందట. అసలు నన్ను కనీసం అడగకుండానే ఆమని వాళ్ల అమ్మకు ఎలా చెప్పగలిగిందో నాకు తెలియలేదు. ఆమనికి అంత నమ్మకం కలిగేలా ఎప్పుడు ప్రవర్తించానో నాకు అర్థం కాలేదు. మరునటిరోజు ఏకాంతం చిక్కించుకొని ఆమనిని కౌగిలిలో బంధించి ఐదు నిమిషాలపాటు వదలకుండా వుంచి అడిగిన మాట "నేను నిన్ను ఖచ్చితంగా పెళ్లి చేసుకుంటానని ఎలా అనుకున్నావ్?" అని.

"ఆవాళ్లకు ఆమాత్రం తెలియదా? నేను నిన్ను తప్ప ఎవరినీ పెళ్లి చేసుకోను అంటే నువ్వు కాదనగలవా? ఎవరినీ బాధపెట్టని నువ్వు నన్ను బాధపెడతావా? నీ మనసు గురించి నీకంటే నాకే ఎక్కువ తెలుసు. అందుకే ఇంట్లో చెప్పాను" అని ఆమని చెప్పగానే మళ్లీ పెదాల్ని ముద్దు పెట్టుకున్నాను.

